# మహేశ్వరం అభివృద్ధికి పెద్దపీట

- ఆదర్శహిల్స్ కాలనీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి
- ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తా



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 3 : మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ ఆదర్శ హిల్స్ కాలనీ వాసులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.400లకే గ్యాస్ ఇస్తామన్నారు. సౌభాగ్యలక్ష్మి కింద మూడు వేలు, 3 లక్షల మందికి తెల్లరేషన్ కార్డు దారులకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.832 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ట్రంక్‌లైన్, నాలాల ఏర్పాటుతో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. తాగు నీటి సమస్య లేకుండా చేయడానికి రూ.280 కోట్లతో మిషన్ భగీరథ పనులు చేపట్టినట్లు తెలిపారు. పైపు లైన్లు, ట్యాంకులు, రిజర్వాయర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 13 బస్తీ దవాఖానలు, 8 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. మరోసారి తనను ఆశీర్వదించాలని, ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తానని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, కార్పొరేటర్లు నవీన్ గౌడ్, భూపాల్ రెడ్డి, బీరప్ప, అనిల్ కుమార్ యాదవ్, కోఆప్షన్ సభ్యుడు జంగయ్య గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కామేశ్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

## పనిచేసే వారినే గెలిపించండి

మంత్రి చామకూర మల్లారెడ్డి



మంత్రి మల్లారెడ్డి సమక్షంలో
బీఆర్ఎస్‌లో చేరుతున్న గిర్మాపూర్ కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్, నవంబర్ 3 : పనిచేసే వారికే ప్రజలు పట్టం కడుతారని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి... గిర్మాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు మేడ్చల్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు అడిగే హక్కే లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేశారని ప్రజల వద్దకు వెళ్తున్నారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు అభిలాష్ గౌడ్, శ్రీకర్, ప్రవీణ్, నవీన్, మహేశ్‌లతో పాటు దాదాపు 50 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 23వ వార్డుకు చెందిన బీజేపీ నాయకులు కౌడె వెంకటేశ్, రాజు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి మంత్రి మల్లారెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 23వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీశైలం, ప్రచారం కార్యదర్శి పెంజర్ల భాస్కర్ యాదవ్, మాజీ వార్డు సభ్యుడు కౌడె నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్య.. దేశాల మధ్య సంబంధాలు..

## ఆర్థిక పురోగతిని ప్రభావితం చేస్తాయి



జూబ్లీహిల్స్,నవంబర్ 3 : విద్య.. దేశాల మధ్య సంబంధాలు, ఆర్థిక పురోగతిని ప్రభావితం చేస్తుందని వీఐటీ చెన్నై వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ పేర్కొన్నారు. శుక్రవారం వీఐటీ చెన్నై ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం..' అనే అంశంపై శుక్రవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శేఖర్ విశ్వనాథన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ ఆఫ్ షీసెల్స్ రాయబారి శేషసాయి, సెనగల్ రాయబాలి అశోక్ ఆర్ ఠక్కర్, టాంజానియా రాయబారి కృష్ణ ఎన్ పింపుల్, జాంబియా రాయబారి సుకుమార్ నగరాజన్, మయన్మార్ రాయబారి ప్రొఫెసర్ జె.రంగనాథన్ పాల్గొని సందేశాలను అందించారు. ఈ కార్యక్రమంలో వీఐటీ చెన్నై ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ వీఎస్ కాంచన భాస్కరన్, సలహాదారు డాక్టర్ ఎస్‌పీ త్యాగరాజన్, అడిషనల్ రిజిస్ట్రార్ డాక్టర్ పీకే మనోహర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ అధిష్ఠానానిది అనాలోచిత చర్య

*బీజేపీ రాష్ట్ర నాయకుడు నందారెడ్డి*



ఖైరతాబాద్, నవంబర్ 3 : బీజేపీ అధిష్ఠానం అనాలోచిత చర్యలకు పాల్పడుతున్నదని, ఫలితంగా సీనియర్లు, అర్హులు పార్టీకి దూరమవుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నందారెడ్డి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన బీజేపీ వైఖరిని ప్రశ్నించారు. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న వారికి ఈ ఎన్నికల్లో మొండి చేయి చూపారన్నారు. వలస వచ్చిన నాయకులకు ప్రాధాన్యతనిస్తున్నారని, పాత వారిని పక్కన పెట్టి కొత్త వారికి అవకాశాలు ఇస్తున్నారని, ఇది పార్టీకి మంచిది కాదన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల సొంత ప్రయోజనాల గురించి ఆలోచిస్తున్నారు తప్పా.. పార్టీని పట్టించుకోవడం లేదని తెలిపారు. అధిష్ఠానం పునరాలోచించకుంటే రాష్ట్రంలో పార్టీయే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు.

## మరోసారి ఆశీర్వదించండి



పాపిరెడ్డికాలనీలో మిర్చీలు వేస్తున్న ప్రభుత్వ విప్ గాంధీ

శేరిలింగంపల్లి, నవంబర్ 3 : నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించాలని అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డి కాలనీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం చేశారు. ప్రజలు అరెకపూడి గాంధీకి మంగళ హారతులిచ్చి, బ్రహ్మరథం పట్టారు. ఆయనకు స్థానికుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే.. ఆసరా ఫించన్ రూ. 2016 నుంచి 5016కు పెంచుతామన్నారు. కేసీఆర్ బీమా పథకం, రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాజుయాదవ్‌తో పాటు పలువురు నాయకులు, మహిళా నేతలు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.

## ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటేయండి

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, నవంబర్ 3 : ఎన్నికలు రాగానే ప్రజలు ఆగమాగం కావొద్దు..ఒకప్పుడు కుత్బుల్లాపూర్ ప్రాంతం ఎట్లుండే..ఇప్పుడు ఎలా అయిందో గమనించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కేపీ వివేకానంద్ అన్నారు. గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాన్ని ఆరున్నరవేల కోట్లతో అభివృద్ధి చేశామని, అభివృద్ధిని చూసి ఓటేయాలని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే అభివృద్ధి జరగదన్నారు. నియోజకవర్గంలోని జీడిమెట్ల డివిజన్ పరిధి.. గోదావరి హోమ్స్ టీఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమం, కాలనీల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని, మిగిలిన అభివృద్ధి పనులను పూర్తి చేసుకొని నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంపత్ మాధవరెడ్డి, గుమ్మడి మధుసూదన్ రాజ్, సుధాకర్‌గౌడ్, జ్ఞానేశ్వర్, సమ్మన్న, కుంట సిద్దిరాములు,నరేందర్‌రెడ్డి, సంపత్ గౌడ్‌తో పాటు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా.. డ్రీమ్ హ్యాక్ హైదరాబాద్ గేమింగ్



డ్రీమ్ హ్యాక్ హైదరాబాద్‌లో
ఉత్సాహంగా ఆటలు ఆడుతున్న ప్లేయర్లు

మాదాపూర్, నవంబర్ 3: దేశంలోనే అతి పెద్ద డిజిటల్ గేమింగ్‌లో ఒకటైన డ్రీమ్ హ్యాక్ హైదరాబాద్ ఆటల్లో ప్రతిభ కలిగిన ప్లేయర్లు పోటీ పడేందుకు మాదాపూర్‌లోని హైటెక్స్ సరైన వేదికైంది. నాడ్విన్ గేమింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రీమ్ హ్యాక్ హైదరాబాద్ గేమింగ్ కార్యక్రమం అత్యాధునిక సాంకేతికతతో నిరంతరం ఉత్కంఠగా సాగింది. ఇందులో నిపుణులైన ప్లేయర్లు వర్చువల్ ద్వారా ఆటలు ఆడుతూ పోటీ పడ్డారు. స్టాల్స్ వద్ద గేమింగ్ టోర్నమెంట్లను నిర్వహించగా, గేమర్లు ఉత్సాహంగా ఆడుతూ సత్తా చాటారు. యువకులు, విద్యార్థులు మొబైల్, వర్చువల్ ద్వారా రియాలిటీ గేమ్‌లను ఆడారు. వర్చువల్ ద్వారా ఆడే ఆటల్లో గేమ్ క్యారక్టర్‌లు ధరించిన దుస్తులను కొంత మంది యువకులు ధరించి సందర్శకులను అలరించారు. డ్రీమ్ హ్యాక్‌లో ఒకరితో మరొకరు పోటీ పడుతూ ఆటల్లో గెలుపొందిన వారికి కార్యక్రమం చివరి రోజు బహుమతులతో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో ఫైట్ నైట్, కాస్ప్లే జోన్, డ్యాన్స్ జోన్, గేమింగ్ జోన్, కంటెంట్ క్రియేటర్స్, రెట్రో జోన్‌లలో చెస్, స్పైడర్ మ్యాన్ గేమ్, ఫైటింగ్ గేమ్‌లతో పాటు చెస్ వంటి ఆటలు ఉన్నాయి. ఇందులో భాగంగా పలువురు గేమ్‌లోని క్యారెక్టర్ల వేషధారణతో తిరుగుతూ దుస్తులను ధరించి అలరించారు.

## ఫ్రీజర్లను రిపేర్ చేయించండి

గాంధీ దవాఖాన వ్యవహారంలో
హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ బాక్సులన్నింటినీ రిపేర్ చేయించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఫ్రీజర్ బాక్సులు 60 ఉంటే అందులో 15 మాత్రమే పని చేస్తున్నాయని పత్రికల్లో వచ్చిన వార్తను హైకోర్టు సుమోటో ప్రజాహిత వ్యాజ్యంగా చేపట్టి శుక్రవారం విచారణ చేపట్టింది. వారంలోగా మరమ్మతులు చేయించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీజర్ బాక్సులు లేక మృతదేహాలు కుళ్లిపోయే దుస్థితి రానీయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, విచారణను వాయిదా వేసింది.